# ఉగాది పంచాంగాలు - దగా ప్రవచనాలు

- పృథ్వీ

ఒకసారి, రాయలసీమకవి పులికంటి కృష్ణారెడ్డి, ఒక ఉగాది కవి సమ్మేళనంలో తనకవిత విన్పించారు. దాని శీర్షిక "ఈ ఉగాది వట్టి దగాది." దగా అంటేమోసం. ప్రతిఏటా ఉగాది రావటం, ఆరోజు పంచాంగ ప్రవచనకారులంతా తమ తమ పంచాంగాలు తెరచి ఏడాది పొడవునా రాబోయే శుభాల గురించి సౌఖ్యాల గురించి ఏ కరువు పెట్టటం, కానీ, వాస్తవ రూపంలో అవేవీ సిద్ధించకపోవటం గురించి తెలియజేస్తూ కృష్ణారెడ్డి తన బాధను కవిత్వీకరించారు.



ఆ దృష్టితో చూసి నపుడు ప్రతి ఉగాది పంచాంగ ఫలితాల విష యంలో దగాదిగానే మన అనుభవంలోకి వస్తుంది.

తెలుగు రాష్ట్రాల వరకే పరిమితమై చూసి నా, ఉగాదినాడు, కొన్ని డజన్లమంది జ్యోతిష్యులు పంచాంగ ఫలితాలు విన్పిస్తుంటారు. ఎవరి పంచాంగం వారిదే. ఎవరి ఫలితాలు వారివే. రాజకీయపార్టీలు ఏర్పాటుచేసే పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో ఈ విషయం సుస్పష్టమవుతుంది. ప్రతిపార్టీకి తమ జ్యోతిష్యాన్ని తాకట్టుపెట్టే ఆస్థాన జ్యోతిష్యులు, ఆపార్టీ పక్షం వహిస్తూ సానుకూలఫలితాలు వల్లిస్తూ భారీ సన్మానాలు, సంభావనలు పొందటం మనం టీవిల్లో చూస్తునే వుంటాం. వాళు చెప్పినఫలితాలు నిజంకానప్పుడు, 'ఎందుకు నిజం కాలేద'ని ఎవరూ ప్రశ్నించరు. ఒకవేళ ప్రశ్నించినా, గ్రహ చారాలని, రాశి ఫలాలని తికమక చేసి చెప్పి తప్పించుకునేందుకు చాలా వంకలు వారికి వుంటాయి. ఆ అవకాశాన్నివారి జ్యోతిష్యం వారికి కల్పించింది. జ్యోతిష్యంలోనే లేని నిజాయితీ, జ్యోతిష్యులలో ఎలా వుంటుంది?

జ్యోతిష్యులందరూ సిద్ధాంతులు కారు. పంచాంగ రచనచేయగల, గణితంపై పూర్తి అవగాహన గల వారే సిద్ధాంతులు. తెలుగురాష్ట్రాల్లో కనీసం డజనుమంది పేరున్న సిద్ధాంతుల పంచాంగాలు ప్రముఖంగా వున్నాయి. ఆ సిద్ధాంతుల గణితాల మధ్యకూడా అనేక విభేదాలు వున్నాయి. ఉగాది, శ్రీరామనవమి లాంటి ఉత్సవసందర్భాలలో తిథులను నిర్ణయించేటపుడు ఆ విభేదాలు బయటపడుతుండటం మనకు తెలుసు. ఆ సమయంలో జరిగే రచ్చను సద్దుమణిగించటానికి కొందరు ప్రముఖులు సైతం తలదూర్చవలసివస్తుంది.

అలాంటి సమయంలో, ఎవరికైనా వచ్చేప్రశ్న - 'పంచాంగాల మధ్య ఎందుకీ తేడాలు?', ఈమాటే మనకు తెలిసిన జ్యోతిష్యుని అడిగితే, 'ఆ తేడా పంచాంగాలదికాదు, పండితులది' అంటాడు. పంచాంగం మీది నమ్మకం చెడగూడదనే అలా చెప్తాడు.

జ్యోతిష్యంలో మూడు ప్రధాన విభాగాలుంటాయి - 1.సిద్ధాంతం, 2.గణితం 3.ఫలితం. పంచాంగ రచనలో మొదటిరెండింటికీ ప్రాధాన్యతవుంటుంది. వాటిపై అవగాహనవుండేవారు సిద్ధాంతులు, గణితం ఆధారంగా ఫలితాల్ని ఊహించి చెప్పటంతో పంచాంగ శ్రవణానికి 'క్రేజ్' పెరుగుతుంది.

## సిద్ధాంతం

పై మూడింటిలో మొదటిదైన సిద్ధాంతం ఆకాశంలో వుండే గ్రహాలగురించి, రాశులగురించి, నక్షత్రాల గురించి చెపుతుంది.

***సూర్యుడు, చంద్రుడు, కుజుడు, బుధుడు, గురువు, శుక్రుడు, శని, రాహువు, కేతువు***

- అనేవి వారు చెప్పే తొమ్మిది గ్రహాలు.

***మేషం, వృషభం, మిథునం, కర్కాటకం, సింహం, కన్య, తుల, వృశ్చిక, ధనుస్సు, మకరం, కుంభం, మీనం***

- ఈ పన్నెండూ రాశులు.

**అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆర్ద్ర, పునర్వశు, పుష్య, ఆశ్లేష, మఘ, పూర్వఫాల్గుణి, ఉత్తర ఫాల్గుణి, హస్త, చిత్త, స్వాతి, విశాఖ, అనురాధ, జ్యేష్ఠ, మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రావణ, ధనిష్ఠ, శతభిష, పూర్వాభద్ర, ఉత్తరాభద్ర, రేవతి,**

-ఈ 27తోపాటు మరికొందరు "అభిజిత్" అనే 28వదానిని కూడా పరిగణిస్తారు.

సూర్యచంద్రాదుల గమనాన్ని గురించి, వాటి గమన మార్గంలో తారసపడే గ్రహాల, రాశుల, నక్షత్రాల వివరాలగురించి సిద్ధాంతభాగం వివరిస్తుంది.

ఈ సిద్ధాంత భాగాన్ని విశ్లేషించి చూస్తే ఆధునిక ఖగోళ విజ్ఞానానికి విరుద్ధంగా కన్పిస్తుంది. సిద్ధాంతులు చెప్పే, తొమ్మిది గ్రహాల్లో సూర్యుడు గ్రహంకాదు. చంద్రుడు ఉపగ్రహం మాత్రమే. రాహు, కేతువులు ఉనికిలోలేవు. ఉనికిలో వున్న భూమికి నవగ్రహాల్లో స్థానంలేదు. ఇక మిగిలినవి 5 గ్రహాలు. రాశులు

12 అని మాత్రమే చెప్పారు కానీ, ఇంకాఎక్కువే వున్నాయంటుంది ఖగోళశాస్త్రం. అంతర్జాతీయ ఖగోళవిజ్ఞానసంఘం (International Astronomical Union) ప్రకారం మనకు కనిపించే గగనంలో ఇప్పటికి 88 రాశులని గుర్తించారు. జ్యోతిష్యం ప్రకారం సూర్యుడు రాశుల్లోకి ప్రవేశిస్తుంటాడు. దాని ప్రకారం చూసినా, 13 రాశులున్నాయంటుంది శాస్త్రం. ఆ 13వరాశి పేరు 'ఒఫియుచస్' (Ophiuchus) అలాగే నక్షత్రగణనంలో తేడా వుండటం వల్ల తిథుల నిర్ణయంలో తేడాలొస్తుంటాయి. స్థూలంగా వీటన్నింటిని పరిశీలించినపుడు పంచాంగానికి, జ్యోతిష్యానికి పునాదిగా వుండే సిద్ధాంతమే లోపభూయిష్టంగా కనిపించటంలేదా? పునాదే సరిగా లేనపుడు, దాని మీద ఆధారపడిన 'గణితం', 'ఫలితం' సరైనవి ఎలా అవుతాయి?

## గణితం

పంచాంగంలో గణిత విభాగం చాలా ముఖ్యమైనది. దాన్ని నేర్చినవారు రాజుకన్నతామే బలవంతులమన్నట్లు చెప్పుకుంటారు. ఈశ్లోకం చూడండి –

**"చతురంగబలో రాజా జగతీం వశమానయేత్**
**అహం పంచాంగబలవా నాకాశం వశమానయే"**

"ఒక దేశాన్ని పాలించేరాజుకి రథాలు, అశ్వాలు, ఏనుగులు, కాల్బలం – అనే నాలుగు బలాలు వుంటాయి. ఈ చతురంగ బలాలతో ఆయన భూమిని తనవశంలోకి తెచ్చుకుంటాడు. నేను పంచాంగ బలంకలవాణ్ణి. ఆకాశాన్నంతటినీ వశపర్చుకుంటాను" అని పంచాంగ పండితుని ప్రకటన.

ఈ ప్రకటనలో చమత్కారముందో, అహంభావముందో ఇక్కడనవసరం. కాని ఒక వాస్తవముంది. నాలుగు బలాలతో రాజు మరోరాజ్యాన్ని ఆక్రమించుకోగలడు. కానీ, ఖగోళ వస్తువులపై తనకున్న ఊహలతో, అంచనాలతో లెక్కలువేసి, వాస్తవజ్ఞానం లేకుండానే, పంచాంగ పండితుడు మాత్రం అజ్ఞానులయిన ప్రజానీకాన్ని తన బుట్టలో వేసుకుంటున్నాడు.

ఇంతకీ, ఆ పండితునికుండే పంచాంగ బలాలు ఏమిటి?

తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం – ఈ అయిదింటిని గురించి చెప్పేదే పంచాంగం. వీటిని నిర్ణయించటానికి ఖగోళ గణితం తెలియాలి.

ఖగోళగణితం గురించి, మహా మహోపాధ్యాయునిగా పేరుగడించిన బహుముఖమేధావి కొమర్రాజు లక్ష్మణరావు ఒక ఉదాహరణ చెప్పారు –

"విజయవాడ నుండి చెన్నై వరకు గల దూరం మనకు తెలుసనుకోండి. వాటిమధ్యలో వచ్చేస్టేషన్ల గురించి, వాటి మధ్యవుండే దూరంగురించి తెలుసనుకోండి. ఒకరైలు ఉదయం 6 గంటలకు విజయవాడలో బయలుదేరితే, ఆ రైలు వేగం తెలిసినపుడు, అది ఏ ఏ స్టేషన్లకు ఎప్పుడు చేరుతుందో చెప్పవచ్చు. పంచాంగ గణితంలో సూర్య చంద్రులు రైలు బండ్లు. 12రాశులు, 27 నక్షత్రాలు ఆకాశంలోని స్టేషన్లు". (భాషలో సరళీకరణ ఈ రచయితది.)

సూర్యుడు, చంద్రుడు – ఈ రెండు ఖగోళవస్తువులు భూమి మీద వుండే వారికి దగ్గరగా కనపడుతుంటాయి. ఆకాశంలో ఒక చివరినుండి మరో చివరికి ప్రయాణిస్తున్నట్లుంటాయి. వాస్తవంగా అయితే, చంద్రుడు మాత్రమే భూమి చుట్టూ తిరుగుతుంటే, భూమి, చంద్రునితో పాటు సూర్యునిచుట్టూ తిరుగుతుంటుంది. సూర్యుడు తిరుగుతున్నట్లునిపించటం దృశ్యభ్రమ.

ప్రాచీన ఖగోళ పరిశీలకులు ఆ దృశ్యభ్రమకు లోనయ్యారు. సూర్య చంద్రులే తిరుగుతున్నారని భావించి, వాటి గమనాల ఆధారంగా ఆకాశ మార్గాన్ని మధ్యలో వచ్చే 'స్టేసన్ల'ని, ఆ స్టేషన్ల మధ్య దూరాన్ని లెక్కగట్టారు. ఆ లెక్కల ఆధారంగానే, భారతీయ పండితులు పంచాంగాలను రూపొందించారు. సూర్యగమనమే లేనపుడు, దానిపై ఆధారపడిన గణితం ఎలా నిజమవుతుందనేది ఇక్కడ ఎదురయ్యే ప్రశ్న.

ఆ ప్రశ్నను అలా వుంచుదాం. సూర్యుడే తిరుగుతున్నాడనుకొని తయారయిన లెక్కల ఆధారంగా పంచాంగ విషయాలను పరిశీలిద్దాం. వాటిని ఎలా లెక్కలు కడతారో చూద్దాం.

## తిథులు

తిథి అంటే మన వాడుకలో ఒకరోజు. దాన్నుంచే తేదీ, డేట్ (Date) వచ్చాయి. ఆకాశంలో తిరుగాడే సూర్యచంద్రులకు మధ్యవుండే దూరాన్ని బట్టి గణించే కాలాన్ని 'తిథి' అంటారు. స్పష్టత కోసం అమావాస్యనుంచి లెక్కమొదలుపెడదాం. అమావాస్య 'అంటే రెండూ కలసివుండటం'. ఆ రోజున సూర్యచంద్రుల మధ్యదూరం సున్న. ఎంతసేపు ఆ రెండింటిమధ్య దూరం శూన్యంగా వుంటుందో అవి అమావాస్య గడియలు. అక్కడ నుంచి సూర్యచంద్రుల ప్రయాణం మొదలయిందనుకోండి. సూర్యగమనం రోజుకు ఒక డిగ్రీదూరం వుండే, చంద్రగమనం 13. 20 డిగ్రీలుంటుంది. ఈరెండింటి మధ్య వుండే దూరం 12 డిగ్రీలు కాగానే ఒక తిథి (రోజు) అవుతుంది. దాన్నే ప్రథమ (పాడ్యమి) అంటాం. ఆరెండింటి మధ్య 24డిగ్రీలు దూరం ఏర్పడితే ద్వితీయ (విదియ) తిథి వస్తుంది. 36 డిగ్రీలయితే

తృతీయ (తదియ) అవుతుంది. ఈ దూరం 180డిగ్రీలకు పోయినపుడు పౌర్ణమి అవుతుంది. సూర్యకిరణాలు చంద్రుని ఉపరితలంలో భూమివైపువుండే భాగంపై పడతాయి గనుక, అవి ప్రతిబింబించి పండువెన్నెలగా మనకు ఆహ్లాదాన్నిస్తాయి. ఆ తర్వాత సూర్యచంద్రుల మధ్య ఏర్పడే గమనకోణంలో వచ్చే మార్పులవల్ల బహుళ తిధులు ఏర్పడతాయి. 360డిగ్రీలకి చేరేటప్పుడికి మళ్లీ ఆరెండూ ఒకేచోటికి చేరి అమావాస్యవస్తుంది.

తిథి సమయాన్ని లెక్కించటానికి పంచాంగగణికులకు ఒక సూత్రం వుంది.

$$\frac{\text{చంద్రగమనం - సూర్యగమనం}}{12} = \text{తిధులు}$$

చంద్ర సూర్యులకు మధ్య 12 డిగ్రీల దూరం ఏర్పడాలంటే 23 గంటల 37 నిమిషాల 28.093 సెకనులు పడుతుంది. ఇలాంటి 30 తిధులు కలిస్తే ఒక చాంద్రమాసం అవుతుంది. రోజుకి 24గంటలకాలం ప్రకారం చూసినపుడు నెలకు 29 1/2 చంద్ర తిధులే వస్తాయి. ఇలా 12నెలలు (చంద్ర సంవత్సరం) గడిచే సరికి 354రోజులు వస్తాయి. కాని నెలకు 30తిధులప్రకారం, 360తిధులు వుంటాయి. ఈ రెండింటి మధ్యవుండే ఆరురోజుల తేడాను సర్దటానికి కొన్ని తిధుల కాలాన్ని పెంచటం, కొన్నింటిని తగ్గించటం చేస్తుంటారు పంచాంగ గణకులు. అందుకే ఒక సంవత్సరంలో సాధారణంగా 13 క్షయ తిధుల్ని, 7 వృద్ధి తిధుల్ని చూపుతుంటారు. తిధుల సమయంలో ఏర్పడే ఈహెచ్చుతగ్గులవల్ల గడియలు (ఒక గడియకు 24 నిమిషాలు), విగడియలు (ఒక విగడియ లేక 24సెకన్ల) మారుతుంటాయి. ఫలానాతిధి ఫలానా సమయానికి పూర్తవుతుందన్న ఖచ్చితమైన నియమంలేదు. ఒకప్పుడు సూర్యోదయానికి పూర్తికావచ్చు, మరొకప్పుడు సాయంత్రానికి ఇంకొకప్పుడు రాత్రికి పూర్తికావచ్చు. అలాంటప్పుడు ఏరోజును ఏ తిధితో పిలవాలి? అనే చిక్కుప్రశ్నవస్తుంది అందుకే పంచాంగ పండితులు ఒక నియమం కల్పించారు. సూర్యోదయ సమయాన ఏ తిధి వుంటే ఆరోజును ఆ తిధితోనే పిలుస్తారు. ఉదాహరణకి, 'ఈనాడు' దినపత్రికవారు పంపిణీచేసిన 2020 సంవత్సరపు కేలండర్ ను అనుసరించి – జనవరి 1వతేదీన 6.34 గంటలకు సూర్యోదయమవుతుంది. ఆ సమయంలో శుక్ల పక్షపు పంచమి తిధి వుంది. సాయంత్రం 4.39గంటలకు షష్ఠి ప్రవేశిస్తుంది. అది 2వ తేదీ సాయంత్రం 6. గంటలవరకు వుంటుంది. కనుక, 1వతేదీని పంచమిగాను, 2వ తేదీని షష్ఠిగాను పిలుస్తారు. తిధులు ప్రవేశించే సమయాన్ని బట్టి కేలండర్ తేదీలను నిర్ణయిస్తే అంతా గందరగోళంగా వుంటుంది.

పైన క్షయతిధులు, వృద్ధి తిధులగురించి చెప్పుకున్నాం. ఒక తిధి సూర్యోదయమైనాక పుట్టి మరలా సూర్యోదయాని కంటే ముందే అంతమయితే అది క్షయతిధి. అలాగే, సూర్యోదయం తర్వాతమొదలై, రెండోరోజంతా వుండి మూడో రోజు సూర్యోదయం అయిన కొద్ది కాలంవరకు ఒకేతిధి వుంటే అది వృద్ధి తిధి. 2020, జనవరి 28, 29 తేదీల్లో వృద్ధి తిధి చవితి.

సూర్యచంద్రగమనాల గణనలో ఏర్పడే తేడాలు, కాలాన్ని గడియలు, విగడియలు, పలలు, విపలలుగా విభజించి గణించటంలో వచ్చేతేడాల వల్ల తిధులను నిర్ణయించటం, వాస్తవ ఖగోళ గణిత పరిజ్ఞానం లేక పోవటం కారణంగా ఇలాంటి గజిబిజి ఎదురవుతుంది. నలుగురు వేర్వేరు సిద్ధాంతుల పంచాంగాలను దగ్గరపెట్టుకొని పరిశీలించినా ఈతేడాతెలుస్తుంది. ఎవరికి వారే తమ పంచాంగం గొప్పదని చాటుతూ వివాదాలకు దిగినపుడు వారిలో పెద్దగొంతున్న వాడిదే పైచేయి అవుతుంది. కానీ, అతనిదీ వాస్తవమని మాత్రం నిరూపించలేదు.

తెలుగు పంచాంగ తిధులన్నీ చంద్రగమన ఆధారంగా వుంటాయి. చంద్రుడు ఆకాశాన ఉన్న ప్రదేశాన్ని బట్టి తిధిని గణించారు. మొత్తం 30తిధుల్ని రెండుపక్షాలుగా విభజించి పాడ్యమినుంచి పౌర్ణమివరకు (15రోజులు) శుక్ల పక్షమని, బహుళ పాడ్యమినుంచి అమావాస్యవరకు (15రోజులు) కృష్ణ పక్షమని అన్నారు. శుక్ల అంటే తెలుపు. కృష్ణ అంటే నలుపు. అయితే, తిధుల్లో వుండే ఎక్కువ తక్కువలను బట్టి 13రోజుల పక్షాలు, 16రోజుల పక్షాలు అరదుగా వస్తుంటాయి. 13–14రోజుల పక్షము వచ్చినపుడు, అది అరిష్ట దాయిక మని, ప్రజా నాశనం తప్పదని భయపెడుతూ వుంటారు పరాన్న భుక్కులయిన సిద్ధాంతులు. వాటి నుంచి బయటపడటానికి యాగాలు, దానాలు డిమండ్ చేస్తారు. తద్వారా తమ ఉనికిని, ఆధిపత్యాన్ని, కుక్షింభరత్వాన్ని పదిలంగా వుంచుకుంటారు. నిజానికి, రోజులు తగ్గినా పెరిగినా వాటి ప్రభావం ప్రజాజీవితంపై వుండనే వుండదు. వాళ్లు చేసే గణాంకాల తప్పులు మానవులకు ఏముప్పునూ కలిగించవు.

తిధుల గురించి మొదటిసారిగా యజుర్వేద, బ్రాహ్మణాల్లో ప్రస్తావన కన్పిస్తుంది. ఐతరేయ బ్రాహ్మణంలో (32 – 10) మొదటిసారిగా 'తిధి'ని నిర్వచించారు.

**"యాం పర్యస్తమియాత్ అభ్యుదయాదితి సా తిధిః"**

చంద్రుని ఉదయాన్ని లేదా అస్తమయాన్ని తెలిపేది తిధి. శుక్ల పక్షంలో అయితే చంద్రాస్తమయం నుంచి మళ్లీ చంద్రాస్తమయందాకా, కృష్ణపక్షంలో అయితే చంద్రోదయం నుంచి తిరిగి చంద్రోదయం దాకా తిధిని లెక్కించాల్సివుంటుందని ప్రొ॥ పి.సి.సేన్ గుప్తా లాంటి వైజ్ఞానికులు తిధిని వ్యాఖ్యానించారు.

ఈ అస్పష్ట కాలప్రమాణంవల్లనే తిథులలో అసమానతలు వచ్చాయని ఆయన అన్నారు.

## వారాలు

పంచాంగంలోని రెండవ అంగం వారం. భారతీయ జ్యోతిష్యానికి మూలాలు విదేశీఖగోళ విజ్ఞానంలో వున్నాయంటే, ఇక్కడిజ్యోతిష్యులు ఒప్పుకోరు. కానీ, వారాలకు మూలాలు ఖచ్చితంగా వైదేశికమేనని రుజువయింది. రోజులను వారాలుగా విభజించటం చాల్దియా దేశంలో మొదలయింది.

క్రీ.పూ. 10–7 శతాబ్దాల మధ్య నల్లసముద్రానికి ఆగ్నేయంగా వున్న చిన్నదేశం చాల్దియా. ఆ తర్వాత అది బాబిలోనియాలో కలసిపోయింది. మెసపొటేమియాకు అతిదగ్గరగా వుండే ఆ పర్వత దేశంలో గగనవీధిలోని ప్రకాశవంతమైన తారలను అదేపనిగా చూస్తూ వాటి భ్రమణాన్ని గుర్తించటం జరిగింది. వేకువ సమయాన, కొన్ని రోజుల్లో సాయం సమయాన ప్రకాశవంతంగా కనిపించే శుక్ర గ్రహం (వీనస్) అక్కడి ఖగోళ జిజ్ఞాసువులను ఆకట్టుకొంది. ఆతర్వాత గురుగ్రహం, దానికి కొంత దూరంగా వుండే కుజగ్రహం, శుక్రగ్రహానికి దగ్గరగా కన్పించే బుధగ్రహం చాలాదూరంగా మినుకు మినుకుమనే శనిగ్రహాన్ని గుర్తించారు. ఆకాశంలోనితారలన్నీ ఒక చోటవుంటాయని, శుక్ర, బుధ, గురు, కుజ, శని మాత్రం వేర్వేరుగా కదులుతూ కన్పిస్తుంటాయని, అవన్నీ భూమ్మీద జరిగే వాటిని గమనించటానికే అలా తిరుగుతుంటాయని భావించారు. వీటితోపాటు, సూర్యచంద్రులు ఎలాగూ వున్నారు. మొత్తం ఈ ఏడింటికి వాటి దూరాలను బట్టి ప్రాధ్యాన్యతనిచ్చారు. ఆ గ్రహాలన్నింటికీ మార్మికశక్తుల్ని కూడా అంటగట్టి ఖగోళారాధన (Astrolatry) ని మొదలుపెట్టారు. క్రీ.పూ. 1000–800 సం॥ మధ్యకాలంలో గ్రహజ్యోతిష్యానికి (Planetory Astrology) కి వారే ఆద్యులయ్యారు.

చాల్దియనులు అనుసరించిన గ్రహాల క్రమత యిలావుండేది – శని, గురు, మంగళ (కుజ), సూర్య, శుక్ర, బుధ, చంద్రుడు. భూమికి దూరంగావున్న 'శని'ని మొదటి స్థానంలో వుంచారు. రోజులోవుండే మొత్తం కాలాన్ని 24గంటలుగా విభజించింది కూడా చాల్దియన్లే. ఒక్కొక్క భాగానికి 'హొరా' అనే పేరుపెట్టింది వారే. హోర అనే పదం నుంచే Hour వచ్చింది. పైన పేర్కొన్న ఏడు ఖగోళాలు భూమి మీద జరిగేవాటిని వీక్షిస్తుంటాయని, అవి కాలాన్ని శాసిస్తుంటాయని వారునమ్మారు. గంటకు ఒక ఖగోళం భూమిని పాలిస్తుందనుకుని, 24గంటలను ఏడింటికీ విభజించారు. అంటే ప్రతి గ్రహమూ రోజులో 3గంటలు పాలిస్తుందన్న మాట. శనిగ్రహంతో మొదలుపెడితే, అది 8, 15, 22 గంటలను ఏలుతుంది. 23వ గంటను గురు, 24 గంటను కుజ గ్రహాలు ఏలటంతో రోజు పూర్తవుతుంది. తర్వాత సూర్యునితో రెండోరోజుమొదలవుతుంది. ఏగ్రహం మొదటి గంటతో మొదలయితే ఆగ్రహం పేరుతో ఆ రోజును పిలిచారు. వారం అంటే సమూహం అనిఅర్థం. రోజులో వుండే గంటల సమూహానికి 'వారం' పేరు స్థిరపడింది. లాటిన్‌లో రోజును Deis అన్నారు. అదే తర్వాత Day అయింది. శనివారం అంటే శని ఆధిపత్యం వస్తున్న గంటల సమూహం (రోజు). తర్వాత సూర్య (ఆదిత్య–ఆది)వారం. తర్వాత చంద్ర (సోమ)వారం... ఇలా ఏడురోజుల వారం ఉనికిలోని వచ్చింది.

చాల్దియా నుంచి మొదలయిన ఈ 'వార' గణనం, ఆ తర్వాత, గ్రీకు, ఈజిప్టు, ఇరాక్... క్రమంగా మిగతా ప్రాంతాలకు వ్యాపించింది. అలెగ్జాండర్ దండయాత్ర తర్వాత అది భారతదేశానికీ పరిచయమై, ఆతర్వాత పంచాంగంలో భాగమయింది. ఇపుడు మనం రోజును కూడా వారంతో పిలుస్తున్నాం. ఏడురోజుల్ని కూడా వారం అంటున్నాం.

అయితే, కొందరు హైందవ జాతీయవాద జ్యోతిష్యులు ఈ వాస్తవాన్ని అంగీకరించరు. గ్రహాల గురించి మన వైదికులకు తెలుసునని బుకాయిస్తారు. వాస్తవాన్ని అంగీకరించే వారు మాత్రం విజ్ఞానం విదేశీయమైనా గ్రాహ్యమేనని సమర్ధిస్తారు. జాతీయవాదిగా పేరుపొందిన ప్రముఖ జ్యోతిష్యుడు, 'జ్యోతిష్యశిఖామణి' అయిన శంకర బాలకృష్ణదీక్షితులు తన "భారతీయ జ్యోతిష్యశాస్త్రం" గ్రంధంలో వారాలు వైదేశికమేనని అంగీకరించాడు.

**"మందాదథ: క్రమేణ స్యుశ్చతుర్థా దివసాధిపా:**
**హోరేశా: సూర్యతనయాదదోథ: క్రమశస్తథా"**

(సూర్యసిద్ధాంతం, భూగోళాధ్యాయం)

తిథుల గణనంలో ప్రపంచవ్యాప్తంగా తేడాలుండవచ్చు గానీ, వారాల గణనంలో మాత్రంలేదు. రోమన్ పాలకులు 8రోజుల్ని వారం గా భావించినా, ఆ తర్వాత ఏడురోజులవారాన్నే స్వీకరించారు.

కాలాన్ని వారాలుగా విభజించిన చాల్దియన్లే, జ్యోతిష్యంలో గ్రహాలను ప్రవేశపెట్టి, వాటికి శుభాశుభాలను అంటించారు. వాటిని ఆరాధించే పద్ధతికి ఆద్యులయ్యారు. అది ఇండియాలో కూడా ప్రవేశించి మరీ వికృత రూపం ధరించింది. ఇపుడు ఇతరదేశాల్లో గ్రహారాధనతగ్గినా, ఇండియా జ్యోతిష్యులు మాత్రం తమ పబ్బం గడుపుకోవటానికి ఇష్టం వచ్చిన విధంగా 'గ్రహచారం, గోచారం' అంటూ జనాన్ని భయపెట్టి పీడిస్తున్నారు.

## నక్షత్రం

నక్షత్రమంటే ఏమిటి? ఆకాశంలో మెరుస్తూ కనిపించేదే కదా అనిచాలామంది అనుకుంటారు. కానీ జ్యోతిష్యం ప్రకారం మెరిసేవన్నీ తారలు. చంద్రుని కక్ష్యలో చంద్రోదయ సమయానికి చంద్రుడు సమీపించే ప్రదేశమే నక్షత్రం.

చంద్రుడు భూమి చుట్టూ పరిభ్రమించే వృత్తాకార కక్ష్యను (360)ను 27తో భాగిస్తే 13.3 వస్తుంది. కానీ జ్యోతిష్యులు $13^0$.20 దూరాన్ని పరిగణనలోకి తీసుకుని, ప్రతిరోజూ చంద్రుడు $13^0$.20 డిగ్రీల మధ్య దూరంలో ప్రయాణిస్తాడని ఎంచి, దాన్ని నక్షత్రమన్నారు. "నక్ష+త్ర" అంటే సమీపించే స్థలం అంటుంది మోనియర్ విలియమ్స్ నిఘంటువు. ఆ స్థలాలకే అశ్విని, భరణి, కృత్తిక మొదలైన 27 పేర్లుంచారు.

తిథుల్లాగే, నక్షత్రాలు కూడా భారతీయ జ్యోతిష్యంలో ప్రత్యేకమైనవి. తిథులప్రస్తావన ఋగ్వేదంలో లేదు. కాని నక్షత్రాల ప్రస్తావనవుంది. కొందరు నక్షత్రాలు కూడా బాబిలోనియానుంచే ఇండియాకు వచ్చాయంటారు. కాని వాటికి రుజువుల్లేవు. తొలినక్షత్రంగా "కృత్తిక"ను గుర్తించి ప్రస్తావించాయి వేదాలు, యజుర్వేదంలో మొదటిసారిగా 27నక్షత్రాల జాబితా పేర్కొనబడింది. అప్పటికి తిథుల్లేవుగనుక, రోజును తెలియజేయాలంటే నక్షత్రాన్నే వాడేవారు. చంద్రుడు 'మఘ' నక్షత్రం దగ్గరున్నాడనుకున్న రోజును 'మఘాదినం అనేవారు. అశోకుని కాలంలో కూడా ఈ పద్ధతి వుంది. పుష్యానక్షత్ర దినాన ఆయన బ్రాహ్మణులకు, శ్రమణులకు భోజనాలు కల్పించి పుణ్యం పొందాడన్న ప్రస్తావన నమోదయింది. యజుర్వేదంలో కూడా పలుచోట్ల నక్షత్రాలపేరుతో దినాలను ప్రస్తావించటం చూడవచ్చు. చాల్డియా నుంచి వారాల గణనం క్రీ.పూ. 300లో ఇండియాకు పరిచయమయ్యాకనే తిథులు, వారాల వాడుక మొదలయింది.

చంద్రుని కక్ష్యలో వెలుగులీనుతూ కన్పించే తారలను "యుగ తార"లని క్రీ.పూ. ఉనికిలోవున్న "వేదాంగజ్యోతిష్యం" ప్రస్తావించింది. దీనికర్త'లాగధుడు' అంటారు. అతని వివరాలుతెలియవు. అదే తొలి భారతీయ జ్యోతిష్య గ్రంథం. వేదాంగాలారింటిలో జ్యోతిష్యం ఒకటి. అదే వేదాంగజ్యోతిష్యం. అందులో $13^0$.20 దూరాన్ని నక్షత్రమన్నారు.

చంద్రుడు భూమి చుట్టూ తిరిగే కక్ష్యను ఒక రేఖతో సూచిస్తే ఆ రేఖకు పైన $5^0$, కింద $5^0$ దూరంలో వుండే తారలనే యుగతారలనాలి. కానీ, క్రీ.శ.400 తర్వాత వచ్చిన వరాహమిహిరాది జ్యోతిష్యులు, చంద్రకక్ష్యలోని 27 బిందువులను తారలుగానే భావించి, వాటిని నక్షత్రాలుగా పిలిచారు. అంటే ప్రదేశాలను కూడా తారలుగా ఎంచి, కక్ష్యకు దూరంగా వుండే తారలకు 27 నక్షత్రాల్లో స్థానం కల్పించారు. ఉదాహరణకి, 'స్వాతి' నక్షత్రం చంద్రుని కక్ష్యకు $37^0$ ఉత్తరంగావుంటే, శ్రావణి $29^0$ ఉత్తరంగా వుంటుంది. పూర్వాభద్ర $19^0$ ఉత్తరాన వుంటుంది. ఇవేవీ చంద్రుని కక్ష్యలో లేవు. అయినా వాటిని కూడా పంచాంగ కర్తలు పరిగణనలోకి తీసుకుంటారు. చంద్రకక్ష్యలో తారసపడే తారలను నక్షత్రాల పేర్లతోనే తెలుగు నెలలనబడే (నిజానికి ఆనెలల పేర్లు సంస్కృతంలో వుంటాయి. సంస్కృత పంచాంగ కర్తలే వాటిని ఏర్పర్చారు) చైత్ర, వైశాఖ, జ్యేష్ఠాదులు ఏర్పడ్డాయి.

చంద్రుడు ఒకనెలలో చుట్టివచ్చే 27నక్షత్రాల దూరాన్ని తిరగటానికి సూర్యునికి 365రోజులు పడుతుంది. సూర్య గమనం కారణంగా ఋతువులు ఏర్పడుతాయన్న విషయాన్ని కృష్ణయజుర్వేద సంబంధమైన తైత్తరీయ సంహిత ప్రస్తావించింది. మధు (వసంత) శుక్ర (గీష్మ), నభ (వర్ష), ఈశ (శరత్), సహస్య (హేమంత), తపస్ (శిశిర) రుతువుల గురించి అందులో వుంది. రుతువులకీ, నక్షత్రాలకు సంబంధాన్ని కూడా నాటి జ్యోతిష్యులు గుర్తించి, మృగశిరాది నక్షత్రాలు వర్ష సంబంధమైనవి, వాటితో చంద్రునికి సంబంధం లేదన్నారు. వాటిని దిననక్షత్రాలుగా గుర్తించలేదు. అలాగే గ్రహాలజ్యోతిష్యం ఉనికిలోకి వచ్చాక, నక్షత్రాలలో గ్రహ సంచారం కూడా వుంటుందని, ఆ కాలాలను ఆ గ్రహాల పేరుతో పిలిచారు, 'కుజచార, బుధచార' పేరుతో అవి పంచాంగాల్లో వుంటాయి. తిథుల్లో ఎలాగైతే ఖచ్చితమైన సమయ పరిధి వుండదో, నక్షత్రాలకు కూడా వుండదు. అందుకే పంచాంగాల్లో ఎవరియిష్టం వారిదేనన్నట్లు తేడాలుంటాయి. ఒక శిశువు పుట్టిన వేళావిశేషాన్ని జాతకరూపంలో చెప్పేటప్పుడు ఈ తిథి, నక్షత్రం లెక్కల గొడవతో జ్యోతిష్యులు తికమకపెట్టేది అందుకే.

## యోగం

పంచాంగంలోని 'యోగా'నికి, ఆసనాలకు సంబంధించిన యోగానికి సంబంధంలేదు. పంచాంగయోగం సూర్యచంద్ర గమనాలకు సంబంధించింది. చంద్ర గమనంలోంచి సూర్య గమనాన్ని తీసివేసి, వచ్చినదాన్ని 12తో భాగిస్తే తిథి వస్తుందన్న సూత్రం ఇంతకు ముందు తెలుసుకున్నాం. దానికి వ్యతిరేకమే యోగం. చంద్రుడు ప్రయాణించిన డిగ్రీలకు, సూర్యుడు ప్రయాణించిన డిగ్రీలను కలిపి, దాన్ని 12తో భాగిస్తే వచ్చేది 'యోగం' దాన్నే నిత్యయోగం అంటారు. యోగం అంటే 'రెండింటి దూరాలను కలపటం'.

పంచాంగంలో నక్షత్రాల్లాగే యోగాలు కూడా 27 - **విష్కంభ, ప్రీతి, ఆయుష్మాన్, సౌభాగ్య, శోభన, అతిగండ, సుకర్మ, ధృతి, శూల, గండ, వృద్ధ, ధ్రువ, వ్యాగత, హర్షణ, వజ్ర, సిద్ధి, వ్యతీపాత, వరేణ్య, పరిఘ, శివ, సిద్ధ, సాధ్య, శుభ, శుక్ల, బ్రహ్మ, ఇంద్ర, వైధృతి.**

పుట్టిన సమయాన్ని బట్టి, శిశువు ఏ యోగంలో పుట్టాడో గుర్తించి, దాన్నిబట్టి అతని భవిష్యత్తును జ్యోతిష్యులు వెల్లడిస్తారు. ఆయుష్మాన్ యోగంలో పుడితే ఎక్కువకాలం జీవిస్తాడని, శోభనయోగంలో పుడితే, విలాస పురుషుడవుతాడని, వజ్రయోగ సమయంలో పుడితే ధనికుడు, శక్తిమంతుడవుతాడని జాతకంలో రాస్తారు. 'వాడికేం, మహర్జాతకుడు', 'నీకాయోగం లేదు' 'వాడి యోగం బాగుంది' అనే మాటలు మనం వింటుంటాం. అవన్నీ ఈ యోగాన్ని వుద్దేశించినవే.

ఐతే, ఇవన్నీ కల్ల బొల్లికబుర్లే. విశ్వాసులను బురిడీ గొట్టించి తమ బుట్టలో పడేసుకోవటానికి మాత్రం పనికివస్తాయి.

## కరణం

పంచాంగంలో అయిదవది ఇది. తిథిలో సగాన్నే కరణం అంటారు. అమావాస్యనుంచి, చంద్రసూర్యుల గమన భేదము 6 అవటానికి ఎంత కాలం పడుతుందో తెలిపేది కరణం. తిథి అనేది ఒకరోజయితే, అందులో సగం కరణం, అంటే ఒకపూట, చాంద్రమానంలో 30తిథులుంటే 60కరణాలున్నట్లు. పంచాంగంలో రోజుకి రెండు కరణాలుచూపాలి. ఐతే, 12 గంటల్లో పూర్తి కాగల కరణాన్ని మాత్రమే చూపుతారు.

కరణాలు మొత్తం 11. వాటిలో నాలుగు మాత్రం నిర్దిష్టంగా వుండి నెలకొకసారి మాత్రమే వస్తుంటాయి. అవి **–శకుని, చతుష్పాద, నాగ, కౌస్తువ (కింస్తుఘ్న)** అనేది. ఈ కరణాలున్న సమయాల్లో పుట్టిన వారు ఎటువంటి వ్యక్తిత్వాలు కల్గివుంటారో పంచాగ కర్తలు రాసిపడేసారు. ఉదాహరణకి, 'శకుని' సమయంలో పుట్టిన శిశువు, శాంతమూర్తి తెలివిగలవాడు, మంచిపనులుచేస్తూ సన్మానాలుపొందుతాడు. శకునికి అధిష్ఠాన దేవత గరుడుడు. ఇలాగే మిగిలిన వాటికి చెపుతారు.

మిగిలిన 7కరణాలు నెలలో మళ్లీమళ్లీ వస్తుంటాయి. అవి– **బవ, బాలవ, కౌలవ, తైతిల, గార, వణిజ, విష్టి** అనేవి. వీటిలో కూడా కొన్ని మంచి ఫలితాల్ని, కొన్ని చెడుఫలితాలనిచ్చేవి. ఉదాహరణకి, బవ అనే కరణం సమయంలో పుడితే, ఆవ్యక్తి పేదవాడవుతాడు. అయినా దయ గల్గివుంటాడు. సైనికునిగా రాణిస్తాడని చెప్తారు. అలాగే చివరిదైన 'విష్టి'లో పుట్టినవాడు దయారహితుడు, స్నేహితులు కూడా లేనివాడు, చెడుపనులుచేసే వాడవుతాడట!

ఇలా చెప్పేవాటికి వేటికీ ప్రమాణాలు, కారణాలు, రుజువులు వుండవు. వారు చెప్పేవాటిలో వైరుధ్యాలు కూడా వుంటాయి. అలా ఎందుకు? అంటే, అదంతే, ప్రాచీన జ్యోతిర్విదులు అలా చెప్పారని దాటవేస్తారు.

## వర్జ్యం

పంచాంగంలోని అయిదింటి గురించి పరిచయం చేయటానికి ఇవన్నీ చెప్పటం జరిగింది. ఇంకా కొన్ని వున్నాయి. వాటిలో ముఖ్యమైనది 'వర్జ్యం' మనతెలుగు వారికి 'వర్జ్యం' గురించి చాలా పట్టింపు వుంటుంది. మిగతా రాష్ట్రాల వారికి అంతవుండదు.

'వర్జ్యం' అనే పదానికి విడువదగినది అని అర్థం. పైన నక్షత్రాల గురించి చెప్పుకున్నాం గదా! చంద్రుని కక్ష్యలో తారసపడే దిన నక్షత్రాల (దినతారలనికూడా అంటారు) లోని కొంత సమయాన్ని విడిచిపెడితే అది వర్జ్యమవుతుంది. ఉదాహరణకు, అశ్వని నక్షత్రంలో 1/6వంతు, భరణిలో 1/5 వంతు, కృత్తికలో 1/2 వంతు సమయాన్ని 'వర్జ్యం' గా భావిస్తుంటారు. ఆ సమయం సూర్యోదయం తర్వాత ఎన్ని గంటలకు వస్తుందో కేలండర్లలో చూపుతారు. 2020 జనవరి 1వ తేదీన వర్జ్యం ఉదయం 8.40గంటలనుండి 10.28వరకు అని చూపారు. రాత్రి సమయల్లో కూడా అది వుంటుంది. 3వతేదీ రాత్రి 8.44 గంటలనుండి 10.31 వరకు వుందని 'చందన బ్రదర్స్' సిద్ధాంతి రాసాడు. మరో సిద్ధాంతి మరో రకంగా కూడా రాయవచ్చు.

'వర్జ్యం' సమయంలో ఏ శుభకార్యాలు చేయరాదని, ఏ కొత్తపనులు చేపట్టరాదని జ్యోతిష్యులు భయపెడతారు కొత్త వస్తువులు కొనరాదంటారు. అయినా పట్టించుకోకుండా పనులను చేపట్టేవారికి, వర్జ్యం కారణంగా ఫలానా నష్టం జరిగిందని చెప్పటానికి కూడా దాఖలా లేవు. రాహుకాలం, యమగండం, గుళిక కాలం, దుర్ముహూర్తం,... పేర్లేవైనా యివన్నీ పంచాంగంలో చోటుచేసుకొని జనాన్ని భయపెట్టటానికే వున్నాయి. "ఏ సమయంలో ఏంచేస్తే ఏమవుతుందో! ఎందుకయినా మంచిది. పంతులుగార్ని అడిగి చేద్దాం." అనే పరాధీన భావజాలంతో జనం కొట్టు మిట్టాడటానికి బాగా ఉపయోగపడుతున్నాయి.

## ఏడాది అధిపతులు

ఉగాది రోజు పంచాంగ పండితులు పక్కాణించే మరోప్రధానాంశం– "సంవత్సరాధిపతులు" "ఈ ఏడాదికి ఫలానా గ్రహము రాజు, ఫలానా గ్రహము మంత్రి".... అంటూ జాబితా ప్రకటిస్తాడు సిద్ధాంతి.

2019లో వచ్చిన ఉగాదికి పంచాంగకర్తలు ఆ ఏడాదికి చెప్పిన అధిపతులెవరోచూద్దాం–

1. రాజు – శనిగ్రహం, 2. మంత్రి – రవి (సూర్యుడు), 3. సేనాధిపతి – శని, 4. సస్యాధిపతి – కుజుడు, 5. ధాన్యాధిపతి – చంద్రుడు 6. అర్ఘాధిపతి – శని 7. మేఘాధిపతి – శని 8.

రసాధిపతి – శుక్రుడు 9. నీరసాధిపతి – కుజుడు.

పై తొమ్మిది అధిపతుల్ని నవనాయకులని కూడా అంటారు. ఒకప్పుడు ఈ సంఖ్య అయిదుగా వుండేది. ఇప్పుడు ఎవరికి నచ్చినట్లుగా వారు పెంచుకున్నారు.

పై అధిపతుల్ని ఎలా నిర్ణయిస్తారు?

చాలా సింపుల్. ఉగాది పండుగ ఏరోజున వస్తే ఆ దినం ఏ గ్రహంపేరుతో వుందో, ఆ గ్రహమే ఆ ఏడాదికి రాజు. 2020 మార్చి 25న వచ్చే ఉగాది బుధవారం వస్తుంది. కనుక 'శార్వరి' నామసంవత్సరమంతటికీ బుధుడే రాజు. తమిళ ఉగాది (సౌర సంవత్సరాది) 2020 ఏప్రిల్ 14 మంగళవారం వస్తుంది. మంగళుడంటే కుజుడు. కనుక కుజగ్రహం మంత్రి. సింహరాశిలో సూర్యుడు ప్రవేశించే దినం ఏదవుతుందో ఆ దినపు గ్రహం సేనాధిపతి. 2020 ఆగస్ట్ 16 ఆదివారం వస్తుంది. కనుక రవి సేనాధిపతి. ఆరుద్ర నక్షత్రంలో సూర్యుడు ఏవారంలో ప్రవేశిస్తే ఆ దినాధిపతి మేఘాధిపతి, జూన్ 21 ఆదివారం అది జరుగుతుంది. కనుక రవి మేఘాధిపతి. అదే విధంగా కర్కాటక రాశిలో సూర్యుడు ప్రవేశించే దినాన సస్యాధిపతి, ధనూరాశిలో ప్రవేశించింది నాన్నిబట్టి ధాన్యాధిపతి నిర్ణయమవుతుంది. కనుక గురుడు సస్యాధిపతి (జూలై16, 2020), కుజుడు (డిశంబర్, 15, 2020) ధాన్యాధిపతి అవుతున్నారు.

ఇలాగే ఇతర ఆధిపత్యాలను కూడా గ్రహాలకు కట్టబెట్టాక, ఆ గ్రహాలకు స్వభావాలను నిర్ణయించి, దాన్ని బట్టి ఏడాదిలో ఏమేంజరుగుతాయో తమ సొంత పాండిత్యం ద్వారా ఏకరువుపెడతారు. వాటన్నిటికీ ఏ ఆధారాలూ వుండవు. కాని వుంటాయని మనల్ని గజిబిజి చేసే భాషతో, లెక్కలతో గందరగోళ పరుస్తారు. అలాగే రాజకీయ పార్టీల భవిష్యత్తును, ఏడాది పాటు ఆపార్టీల, నాయకుల కుండే శుభాలను ఆ పార్టీల నాయకుల పుట్టుకతేదీ, పేరుబలాల ఆధారంగా వల్లెవేస్తారు. అవన్నీ డంబాలే.

మీరు నాలుగైదు సంవత్సరాల పంచాంగ ఫలితాలను బేరీజు వేసి చూడండి. పదాలగారడీతో అవే విషయాలు మళ్లీ మళ్లీ రావటం గుర్తిస్తారు. అలాగే, చెప్పిన జ్యోస్యాలు ఎంతవరకు నిజమయ్యాయో పరిశీలించండి. పంచాంగ బూటకాలకు మీరే పక్కున నవ్వుతారు.

ఈమధ్య జ్యోతిష్యులు కొత్త మాటల్ని వాడుతున్నారు. జ్యోతిష్యం సైన్సుకాదన్న ప్రకటనలు శాస్త్రవేత్తలనుంచి, మేధావులనుంచి రావటం గమనించాక, "జ్యోతిష్యం సూచనలు చేస్తుంది. అవి నచ్చితే పాటించండి లేదా, వదిలేయండి." అంటున్నారు. ఇది ఒకరకంగా వారి పరాజయాన్ని అంగీకరించటమే.

జ్యోతిష్యంలో వుండే మూడు ప్రధానభాగాల్లో సిద్ధాంతం, గణితం ఈరెండూతప్పే. భూకేంద్ర సిద్ధాంతంపై ఆధారపడిన జ్యోతిష్యం ఈనాటి సూర్యకేంద్ర సిద్ధాంతానికి ఏమాత్రం పొసగదు. అలాగే, గణితం కూడా. సూర్యుడు తిరగడని భూమే సూర్యునిచుట్టు తిరుగు తుందని ఇపుడందరికీ తెలుసు. అయినా సూర్యగమనాన్నే జ్యోతిష్యం స్వీకరిస్తున్నది. రాశుల్లోకి, నక్షత్రాల్లోకి సూర్యుడు ప్రవేశిస్తాడని చెపుతూ, వాటి ఫలితాలను కొండంతాలు చేసిచెప్తున్నది. ఆ గణాంకాలన్నీ తప్పేకదా!

ఈ మాటకు జ్యోతిష్యులు చెప్పే జవాబు మరీవింతగా వుంటుంది. భూమి సూర్యునిచుట్టూ తిరుగుతున్నపుడు, దాని అక్షాంశ, రేఖాంశాలను బట్టి కూడా రాశి ఫలితాలను, గ్రహబలాలను, నక్షత్రాలను నిర్ణయించుతారట! అలా అని ఏ పంచాంగ పండితుడయినా, పంచాంగం తయారుచేసాడా? అని అడిగితే మాత్రం నోరెత్తరు.

కొన్ని వేల సంవత్సరాలనాడు ఆకాశాన్ని పరిశీలించటం ద్వారా, భూమ్మీదజరిగే ఉత్పాతాలకు ఖగోళాలు కారణమేమోనని భావించటం ద్వారా, నాటి మేధావుల ఆలోచనలనుంచి పుట్టుకొచ్చిన జ్యోతిర్విజ్ఞానం కాలాన్నిబట్టి మారుతూ వచ్చింది. కాలాన్ని కొలవటానికి గంటలు, రోజులు, వారాలు, పక్షాలు, నెలలు, సంవత్సరాల ఏర్పాటుకు సహకరించింది. శాస్త్రీయమైన ఖగోళ విజ్ఞానం వేరైపోయి జనాన్ని భయపెట్టి అజ్ఞానంలో ముంచితేల్చే జ్యోతిష్యం కూడా పుట్టుకొచ్చింది. ఇప్పుడు ఖగోళ విజ్ఞానం వేయి పూవులుగా వికసించి, విశ్వ రహస్యాలను వెల్లడిస్తూ వెళుతోంది. ఖగోళ వస్తువుల ఉనికిని, స్వభావాన్ని, వాటి భ్రమణాలను, పరిభ్రమణాలను తేటతెల్లం చేస్తూ భూమికీ వాటికీగల సంబంధాన్ని వివరిస్తోంది. భూమికి అతిదగ్గరగా వుండే సూర్యచంద్రుల ప్రభావం జీవులపై ఏ మేరకు, ఏ ఏ అంశాల్లో వుంటుందో తెలుపుతోంది. సుదూరంలో వున్న అన్ని గ్రహాలకు రాశులకు, మనుషులతో ఏ సంబంధమూవుండదని అవన్నీ నిర్జీవాలని చాటిచెపుతోంది.

అయినాసరే, జ్యోతిష్యులు కాలంచెప్పిన పంచాంగాల్నే వల్లిస్తూ జనాన్ని భ్రమల్లో ముంచటం ఖచ్చితంగా సామాజిక బాధ్యతా రాహిత్యమే, వారంతా పర భాగ్యోపజీవులే. వేషభాషల డాంబికతను ప్రదర్శిస్తూ అజ్ఞానాన్ని అమ్ముతూ పొట్ట పోసుకునేవారే, వారినుంచి, వారి జ్యోతిష్యం నుంచి జనమే దూరం కావాలి. ధూమపానం ఆరోగ్యానికి హానికరమైనట్లే, జ్యోతిష్యం జీవన వికాసానికి హానికరమని తెలుసుకోవాలి.

ఒకప్పుడు ప్రపంచంలో ఎన్నో కేలండర్లు (పంచాంగాలు) వుండేవి. ఇండియాలోనే 60కి పైగా వుండేవి. ఇక అస్సీరియా, మెసపొటేమియా, చాల్దియా, బాబిలోనియా, చైనీస్, మంగోలి, జపానీస్.... ఇలా ఎన్నో ఎన్నెన్నో. అవన్నీ యిప్పుడులేవు. ఆధునిక ఖగోళ విజ్ఞానాధారితమైన ప్రపంచ కేలండర్ వచ్చిన తర్వాత,

క్రమంగా అవి కనుమరుగయ్యాయి. ఇండియాలో కూడా వాటి సంఖ్య తగ్గుముఖం పట్టినా, కొన్ని రాష్ట్రాల్లోని పంచాంగ పండితులు మాత్రం 'హిందూసంస్కృతి', 'జాతీయవాద పరిరక్షణ'ల పేరుతో అశాస్త్రీయతను పదిలం చేస్తున్నారు. ఇది ఏరకంగానూ భారతదేశ వికాసానికి తోడ్పడదు.

పంచాంగాల గురించి రాయాలంటే ఇంకా చాలా వుంది. భారతీయ పంచాంగాల్లో వున్న సాయన, నిరాయన, దృక్‌గణిత, నాటికల్ పంచాంగ భేదాలగురించి, రాశిఫలాలు, గ్రహబలాలు (***వీటి గురించి స్వేచ్ఛాలోచన 2019 జూలై సంచిక కొంత సమాచార మందించింది - ఎడిటర్***) చెప్పాల్సివుంటుంది. అసలు పంచాంగ దోపిడీకి మూలమెవరు? వేద కాలంలో లేని సిద్ధాంతులు ఎలా ఏర్పడ్డారు? ఉత్తర, దక్షిణ భారత పంచాంగాల భేదాలేమిటి ఇలా అనేక అంశాలున్నాయి. స్వేచ్ఛాలోచనలో అవన్నీ సమయాన్నిబట్టి అందించటం జరుగుతుంది. 'పంచాంగం' అంటే ఏమిటో, అందులో ముఖ్య భాగాలెలావుంటాయో చెప్పటానికి ఈ రచన అవసరమైంది.

కొమర్రాజు లక్ష్మణరావు పండితుడు రాసిన 'పంచాంగం' అనే వ్యాసం, భారత ప్రభుత్వం ఏర్పాటుచేసిన "కేలండర్ రిఫార్మ్‌కమిటీ" అందించిన సమాచారం, కొందరు సిద్ధాంతుల పంచాంగాలు ఇందుకు తోడ్పడ్డాయి. వారందరికీ కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ◆

## సంప్రదాయ అంత్యక్రియలకు కాలం చెల్లింది.

తమ్మర (కోదాడ), సూర్యాపేట జిల్లా, ఫిబ్రవరి 8 :

జనవరి 31న మరణించిన, మా.వి.వే. తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడయిన జార్జిగారి భార్య తులశమ్మ గారి సంస్మరణ సభ వారి స్వగృహంలో జరిగింది. సూర్యాపేట జిల్లా మా.వి.వే. అధ్యక్షుడు నందిగామ శ్రీనివాస్ సభాధ్యక్షత వహించారు. జార్జి గారితోపాటు వారి కుటుంబసభ్యులు కూడా తులశమ్మ గారితో తమ జ్ఞాపకాలను వెల్లడించారు. మా.వి.వే. కేంద్ర అధ్యక్షుడు సాంబశివరావు, అత్యంత క్రియల్లో రావలసిన మార్పు లను వివరించారు. మా.వి.వే. కళా మండలి సభ్యులు వెంకన్న, శ్యాం, ప్రసాద్ మొ॥ వారు సామాజిక గీతాలు పాడారు. మా.వి.వే. తరపున బుచ్చయ్య, తుమ్మా భాస్కర్, గుండ నరసింహారావు, మొ॥ వారు సంతాపం తెలిపారు. జార్జి గారి మిత్రులు, బంధువులు పలువురు సంతాపం తెలియజేసారు.



**హితవాక్యం**

## ఉద్యమకారులకు వారధి

స్వేచ్ఛాలోచన ఫిబ్రవరి పత్రిక 27 వ తేదీ అందింది. చాలా బాగుంది. ఒక కరపత్రం తీసుకురావటమే కష్టమవుతున్న ఈ రోజుల్లో 52 పేజీల పత్రికను రెగ్యులర్‌గా తేవటం ఎంతకష్టమో నాకు తెలుసు. పత్రిక ధర 25 రూపాయలు. ఎలా సరిపోతది? చాలదే. మొత్తం పత్రిక హేతువాద ఆలోచనల వ్యాప్తికి, ఉద్యమ కారులకీ వారధిగా వుంటున్నది. ప్రతి వ్యాసమూ చిరకాలం భద్రపరచుకోదగిన రీతిలో వస్తున్నది.

**- టి. శ్రీరామమూర్తి,**

**భారతనాస్తిక సమాజం, ఆం.ప్ర. శాఖ అధ్యక్షుడు,**

**విశాఖపట్నం. ఫోన్ : 7780209421**

## అన్ని మంచి రచనలే

ఫిబ్రవరి నెల సైన్స్ ప్రత్యేక సంచికగా "స్వేచ్ఛాలోచన పత్రిక " తెచ్చినందుకు అభినందనలు. ఎక్కువ కాలం దాచుకో తగిన అనేక విలువయిన వ్యాసాలు వున్నాయి. అట్ట మీద బొమ్మలు నాలుగు బావున్నాయి.అందులో నాలుగోది అట్ట వెనుక నూతన విశ్వాంతరాళ పరిచయం – అంతరిక్ష విశేషాలు చాలా బావున్నాయి. మొత్తం చదవటానికి సమయం పడుతుంది, అర్థం చేసుకుంటూ చదవ వలసిన వ్యాసాలే అన్నీ. చివరకు కొసమెరుపుగా సెల్ ఫోన్ వలన ఉపయోగాలు– నష్టాలు, కూల్ డ్రింక్స్ ఎలా కిల్ డ్రింక్స్ గా వున్నాయని మంచి సమాచారం ఇచ్చారు.మీ కృషి నిరంతరం ఇలాగే సాగాలని,వర్తమాన దేశ సమస్యలయిన CAA/ NRC / NPR వంటి దుర్మార్గ చట్టాలపైన , వర్తమాన ప్రజా సమస్యలపైన కూడా ఇంతే విలువయిన ప్రజాపక్ష సమాచారాన్ని పాఠకులకు అందించడంలో శ్రద్ధ చూపగలరని కోరుతూ, మీ కృషికి అభినందనలు తెలుపుతున్నాను.

**-రేకా చంద్ర శేఖర రావు ఫోన్ : 9502181485**

## సంతాపం

మానవ వికాస వేదిక తెలంగాణా రాష్ట్ర శాఖకు గౌరవాధ్యక్షునిగా వున్న బి. జార్జిగారి సంహచరి తులశమ్మగారు అనారోగ్యంతో జనవరి 31వ తేదీ మరణించారు. ఆ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు వున్నారు. సౌజన్యమూర్తి అయిన తులశమ్మగారు లేకపోవటం, ఆకుటుంబానికి పూడ్చలేని లోటే. వారి మృతికి మా.వి.వే. కేంద్ర, రాష్ట్ర కమిటీలు సంతాపం ప్రకటించాయి. కేంద్ర కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఎన్. మూర్తి సంతాపం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. అనంత రామయ్య, రొంటాల బుచ్చయ్యలు స్వయంగా వెళ్లి నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యులంతా హాజరై మతరహిత పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.